# 8

# విరిగిన హృదయము

*"దుఃఖపడువారు ధన్యులు, వారు ఓదార్చబడుదురు" (మత్తయి 5:4).*

దుఃఖపడడం ద్వారా సంతోషంగా ఉంటారని ప్రభువు అనడం ఎంతగా కన్పిస్తుంది, కాని దుఃఖపడడం అనేది దేవుని వాక్యం యొక్క స్థిరమైన చర్చనీయాంశమైయుంది. దావీదు యొక్క మారుమనస్సు కీర్తనలో అతడు ఈ తీర్మానానికి చేరుకున్నాడు:

> ప్రభువా, నా నోరు నీ స్తుతిని ప్రచురపరచునట్లు నా పెదవులను తెరువుము. నీవు బలిని కోరువాడవుకావు కోరినయెడల నేను అర్పించుదును దహనబలి నీ కిష్టమైనది కాదు, విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు. దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు (కీర్తన. 51:15-17).

నవ్వు అత్యధికంగా ఆదరింపబడుతున్న ఈ కాలంలో, ఎవ్వరూ ఏడుస్తూ ఉండగా మనం చూడలేం. ఈ భావన యంతటిని గ్రహించడం కష్టంగా కన్పిస్తుంది.

## దుఃఖపడడం అంటే అర్థమేమి?

దుఃఖపడడం అని మత్తయి 5:4లో ఉపయోగించబడిన పదం దుఃఖంకొరకు సాధ్యమైనంత బలీయమైన పదమైయుంది. తమ ప్రియులు చనిపోయినప్పుడు కుటుంబ సభ్యులు ఏడ్చే ఏడ్పును ఈ పదం సూచిస్తుంది. దుఃఖపడడమనే అనుభవం కంటె చాలా ఎక్కువైనది. అది నిజంగా విరిగిన హృదయము కలిగియుండడమే. పేతురు ప్రభువును ముమ్మారు ఎరుగనినిన తరువాత అతడు ప్రదర్శించిన దుఃఖాన్ని యిది సూచిస్తుంది. కోడి కూసినప్పుడు, తన యజమానుని మాటలను అతడు జ్ఞాపకం చేసికొన్నాడు. "అప్పుడు ప్రభువు తిరిగి పేతురువైపు చూచెను గనుక పేతురు – ప్రభువు తనతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొని ... సంతాపపడి యేడ్చెను" (లూకా 22:61, 62).

తన పతనం విషయంలో దుఃఖపడే హృదయము తన దోషాన్ని గూర్చి బాధపడేంత లేతదైయుంటుంది. పాపం విషయంలో దుఃఖపడేవారు బాధపడతారేగాని, సాకులు చెప్పరు. తాము చేసిన తప్పుల నిమిత్తము యితరులను నిందించడానికి సమయాన్ని గడప ప్రయత్నించరు. తన పాపము గూర్చి సాతాను దావీదును ఒప్పించినప్పుడు అతడు దుఃఖించాడు. కీర్తన. 51లో అతడు దేవునికి యిలా ప్రార్థించాడు: "నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము. నా పాపము పోవునట్లు నన్ను పవిత్రపరచుము. నా అతిక్రమములు నాకు తెలిసేయున్నవి నా పాపమెల్లప్పుడు నాయెదుట నున్నది. నీకు కేవలము నీకే విరోధముగా నేను పాపము చేసియున్నాను నీ దృష్టియెదుట నేను

చెడుతనము చేసియున్నాను" (2-4 వ.). నిజమైన దుఃఖానికి అంతరాయం కలిగించేది మన పాపం విషయంలో నిజమైన దోషాన్ని అనుభవించకుండ మన మనస్సాక్షి కఠినం చేయబడడమే.

## దుఃఖించడం - సువార్త ప్రకటన

ఆత్మలను సంపాదించే వారందరికంటె అత్యధికమైనవాడు ప్రభువు. పాపములో జీవించుచున్న వారి విషయములో ఆయన బాధపడ్డాడు. "యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచును నీయొద్దకు పంపబడినవారిని రాళ్లతో కొట్టుచును ఉండుదానా, కోడి తన పిల్లలను రెక్కలక్రింది కేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నోమారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లకపోతిరి" (మత్తయి 23:37) అని ఆయన యెరూషలేమును గూర్చి విలపించాడు. దేవునికొరకు మనుష్యులను సంధించడానికి సరియైన జ్ఞానంకంటె ఎక్కువైనది అవసరం. పాపుల విషయమై విరిగి నలిగిన మనస్సు దానికి కావాలి. కీర్తన. 126:5, 6లో దేవుడు యిలా అంటున్నాడు, "కన్నీళ్లు విడుచుచు విత్తువారు సంతోష గానముతో పంటకోసెదరు. పిడికెడు విత్తనములు చేత పట్టుకొని యేడ్చుచుపోవు విత్తువాడు సంతోషగానము చేయుచు పనలు మోసికొని వచ్చును."

మన చుట్టునున్న లోకము నశించిపోయినది. ప్రజలందరి జీవితాలమీద పాపము దండయాత్ర చేసింది (రోమా 3:23). అందరు పాపమునకు బంధీలైయున్నారు. నేరాన్ని, క్రూరత్వాన్ని, విడిపోయిన కుటుంబాలను, జీవితాలను పాప ఫలితంగా చూచినప్పుడు మన హృదయం పగిలిపోతుంది. వేలకొలది పసిబిడ్డలు గర్భస్రావమౌతున్నారని విన్నప్పుడు, కన్నప్పుడు, దుష్టులైన తల్లిదండ్రులకు జనించిన శిశువులు నిర్లక్ష్యం చేయబడి, నిందించబడుతున్నప్పుడు మన హృదయాలు పగులుతాయి. లోకం యొక్క పాపమును గూర్చియు దుష్టత్వాన్ని గూర్చియు పట్టించుకోక పోవడం సులభమే గనుక మనం చూచే బాధ లేక వేదనచే మనం బాధింపబడక పోవచ్చు. నశించి, మరణానికి జోగిపోయే లోకానికి రక్షణ సందేశాన్ని మనం తీసికొని వెళ్లాలనే ఆసక్తిని చూపక ముందు, అక్కడ నిలిచి ఉన్న పాపము విషయమై దీర్ఘంగా విలపించవలసిన వారమైయున్నాం.

## దుఃఖించడం సహోదరత్వం

1 కొరింథీ. 12లో క్రీస్తు శరీరములోని సాటి సహోదరుల మధ్య ఉండవలసిన సంబంధాన్ని గూర్చి పౌలు వర్ణించినప్పుడు, మనం ఒకరికొకరం అవయవములమైయున్నట్టు అతడు సూచించాడు. శరీరములో బలహీనులమైయున్న వారిమీద ఎక్కువ ఘనత నిలుపవలసిన అవసరమున్నట్టు అతడు చెప్పాడు. "కాగా ఒక అవయవము శ్రమపడునప్పుడు అవయవములన్నియు దానితోకూడా శ్రమపడును; ఒక అవయవము ఘనత పొందునప్పుడు అవయవములన్నియు దానితోకూడా సంతోషించును" (26 వ.). రోమా 12:15లో, "సంతోషించువారితో సంతోషించుడి; ఏడ్చువారితో ఏడువుడ

ి" అని అతడు విజ్ఞాపన చేశాడు.

శరీరములోని సాటి అవయవములు బాధపడుతూ, శ్రమ అనుభవించుట మనం చూచినప్పుడు, దానిచే మనము నలిగినవారమై, వారియెడల ప్రేమతో వారిని సంధించువారమైయుండాలి. ఎండిపోయిన కన్నులతో, ప్రేమలేని హృదయములతో నీకు సహాయపడవచ్చిన జనులు నీకు ఎన్నడును సహాయము చేయలేరు.

## దుఃఖపడుటలోని దీవెన

దుఃఖపడేవారికి వచ్చే దీవెన ఏమి? "వారు ఓదార్చబడుదురు" అని ప్రభువు తెలిపాడు. 2 కొరింథీ. 1:3, 4లో పౌలు యిలా వ్రాశాడు, "కనికరము చూపు తండ్రి, సమస్తమైన ఆదరణను అనుగ్రహించు దేవుడు, మన ప్రభువైన యేసుక్రీస్తు తండ్రియునైన దేవుడు స్తుతింపబడునుగాక. దేవుడు మమ్మును ఏ ఆదరణతో ఆదరించుచున్నాడో, ఆ ఆదరణతో ఎట్టి శ్రమలలో ఉన్నవారినైనను ఆదరించుటకు శక్తిగలవారమగునట్లు, ఆయన మా శ్రమ అంతటిలో మమ్మును ఆదరించుచున్నాడు," దేవుడు సమస్త ఆదరణకు దేవుడై యున్నాడు. మన బాధలలో ఆయన మనలను ఆదరించువాడైయున్నాడు. మనము విరిగి నలిగిన హృదయములు గలవారమైనప్పుడు, దేవుడు ఆ బలిని స్వీకరించి ఆయన సేవలో మనలను ఆశీర్వదిస్తాడు.

దుఃఖపడే హృదయాలు కలిగియుండే పర్యంతము, మనము ఆదరణయు ఆశీర్వాదమును పొందలేమన్న సంగతి మనం నేర్చుకోవాలి. ఆదరించు స్వస్థపరచు దేవుని కరుణాహస్తము మన యొద్దకు రాకముందు మనం తాకబడేలా ఉండాలి ఆ బాధను ఫీలయ్యేలా ఉండాలి.

తిరిగి మన మెన్నడు బాధింపబడకుండా ఉండేలా మన హృదయాలచుట్టు గోడలు నిర్మించుకొనే శోధన ఎల్లవేళలా కలుగుతుంది. తాము ప్రేమించేవారిని విపత్కరంగా పోగొట్టుకున్నవారితో మరణంలోగాని, విడాకుల ద్వారాగాని కోల్పోయిన వారితో ప్రేమగా మాట్లాడు. వారు అనుభవించుతున్న వేదనను వారు వర్ణించుతుండగా, తరచుగా వారు యిలా అంటుంటారు: "మరెవ్వరిని యికను యింత సన్నిహితంగా చేర్చుకోను, ఈలాటి వేదనను నేను సహించలేను." ఈలాటి బాధల యొద్దనుండి మనలను మనమే సంపూర్ణంగా మూసివేసికొంటే, దేవుని యొద్దనుండియు, మనయందు లక్ష్యముంచే యితరులనుండియు మనము ఆదరణ పొందలేనివారమై యుంటాం.

దుఃఖపడేవారిని దేవుడు ఎలా ఆదరిస్తాడు? మనం ఎదుర్కొంటున్న సమస్యనుండి మనలను విడిపించుటద్వారా ఆయన కొన్నిసార్లు మనలను ఆదరిస్తాడు (2 కొరింథీ. 1:8-10). స్నేహితులు సహాయం పంపడంద్వారా కొన్నిసార్లు మనలను ఆదరిస్తాడు (2 కొరింథీ. 7:6, 7). మరి కొన్నిసార్లయితే, పోరాటంలో మనలను నిలిపి, పరిస్థితులను నిర్వహించేలా కృప అనుగ్రహించుతూ, దాని ద్వారా మనలను పెంపారేలా చూస్తాడు (2 కొరింథీ. 12:7-10).

## ముగింపు

నీ చుట్టు ప్రక్కల ఉన్నవారి బాధలకు అనుభూతి చెందేలా నీవు నీ హృదయాన్ని తెరుస్తావా? నీ పాపములను నీ సొంత పతనాలను నీ దేవుని యెదుట పూర్ణంగా అంగీకరిస్తూ, నీవు ఎరిగిన నీ పాపములను బట్టి నలిగిన హృదయము కలవాడవై యుంటావా? గాయపరచబడిన వారిని సంధిండం ద్వారా ఎక్కువైన వేదన, దుఃఖము కలుగుతుందని ఎరిగి, వారిని ఆదరించడానికి ముందుకు సాగుదువా?

నీవు అలా చేసినట్టయితే, దాని నిమిత్తము దేవుడు తప్పక నిన్ను ఆశీర్వదించుతాడు.

పరలోకమందున్న మా తండ్రీ, మా దేవా, నీ పరిశుద్ధ నామమునకు స్తుతి, ఘనత మహిమ కలుగునుగాక. తండ్రీ, మా పతనాల కొరకు సాకులు వెదకుతూ, విరిగి నలిగి యుండడానికి నిరాకరించిన వారమని మే మెరుగుదుము. మా సొంత జీవితాలలో ఉన్న విషయంలో మా హృదయాలను పగులగొట్టవలసిందిగా మీకు మనవి చేసికొంటున్నాం. మా సాకులను తొలగించండి. మా సొంత జీవితాలలో ఉన్న బాధలు, నిరాశలు అనేవాటి గుండా మేము వెళ్లుతూ ఉండగా, మమ్మును ఓదార్చే వారమయ్యేలా చేయండి.